BHARATH SAMACHAR DIGITAL

21, నవంబర్ 2026, శనివారం భారత్ సమాచార్

కబడ్డీ క్రీడాకారులకు ఘనంగా సన్మానం



భారత్ సమాచార్, సిద్దిపేట జిల్లా: ఉమ్మడి మెదక్ జిల్లా కబడ్డీ జట్టుకు హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమని ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన అసోసియేషన్ ప్రతినిధులు.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి సరైన సమయంలో ప్రోత్సాహం అందిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

క్రీడలు విద్యార్థుల్లో పట్టుదల, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించడం ద్వారా వారు తమ లక్ష్యాలను చేరుకోవడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో చోటు దక్కించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి రాజారెడ్డి, కోశాధికారి సంపత్, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, ఈసీ సభ్యులు అజయ్, స్రవంతి, కవిత, మాధవి, లావణ్య, కళావతి పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar